# ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మే 4, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల సత్వరపరిష్కారంకోసంప్రతిసోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సదాయంలోని ప్రధాన సమావేశము హాలులో నిర్వహిస్తున్న ప్రజావాణికార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రేపటి నుండి జరిగే రెవి న్యూ సదస్సుల కార్యక్రమాలు ఉండడంతో 5న జరగాల్సిన ప్రజావాణిని వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. జిల్లాప్రజలు ఈవిషయాన్ని గమనించి జిల్లా యంత్రాం గానికిసహకరించాలని, కలెక్టరెట్ కార్యా లయానికి ప్రజలు ఎవ్వరు కూడా లోనికి రాకూడదని కలెక్టర్ కోరారు .

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# ఉచిత కంటి వైద్య శిభిరం

**మేడ్చల్, మే 4, ప్రభాతవార్త ః**
పేద ప్రజలకు ఇంటి దగ్గరలోనె వేద్య సేవలు అందించడానికి గాను ఉచిత వైద్య శిభిరాలను ఏర్పాటు చేయడం జరుగుతున్నదని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి శోభారాణి అన్నారు. మేడ్చల్ మండలంలోని రాజబొల్లారంలో సనాతన ధర్మ సేవా సమితి, ఎల్ వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్, పాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ శిభిరాన్ని పారంభించిన ఆమె మాట్లాడుతూ ఆస్పత్రికి వెళ్లలేని నిరు పేదలకు, వృద్దులకు, మహిళలకు ఇంటి దగ్గరలోనె ఉచిత వైద్య శిభిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలకు ఈ శిభిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని కోరారు. వైద్యులు ప్రతిభ, ప్రనతి, సూపవైజర్లు గీత, సుదర్శన్‌రెడ్డి, రజిణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన నీట్ ప్రవేశ పరీక్ష

## -పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



నీట్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మే 4, ప్రభాతవార్త:** వికారాబాద్ మునిసిపల్ పరిధిలో నీట్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జడ్పీ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాల కళాశాల, సంఘం లక్ష్మీబాయి గురుకుల, కొత్తగడిలోని గురుకుల పాఠశాల, కళాశాలల్లో జరిగిన నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తో కలిసి పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. మున్సిపల్ పరిధిలో 5 పరీక్షా కేంద్రాల్లో 1193 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా, 39 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజర్ అయ్యారని, 1154 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావడం జరిగిందని అధికారులు తెలిపారు.

# రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## -మండల కాంగ్రెస్ అధ్యక్షులు బిల్లపాటి రాజశేఖర్‌రెడ్డి



సంవిధాన్ ర్యాలీలో పాల్గొన్న బిల్లపాటి రాజశేఖర్‌రెడ్డి

**వికారాబాద్, మే 4, ప్రభాతవార్త:** రాజ్యంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల కాంగ్రెస్ అధనయక్షులు బిల్లపాటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జై బాబు..జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ మండలంలోని జైదుపల్లి, సర్పన్‌పల్లి గ్రామంలో ర్యాలీ తీసి సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బిళ్లపాటి రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నం చేస్తున్నారని,అమిత్ షా నిండు సభలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ని అవమాన పరిచారరాని అన్నారు. భారత ప్రజలు గమనించాలని అన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ ధోరణితో దేశ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, ఉద్యోగ అవకాశాలు లేకుండా చేశారని ధరల నియంత్రణ చట్టాన్ని ఎత్తివేశారాని దుయ్యబట్టారు. కులమతాల పేర విపరీతంగా దాడులు జరుగుతున్నాయని, కుల వివక్ష పెరిగిపోతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ డైరెక్టర్ జపర్, మండల పార్టీ నాయకులు,మాజీ ఎంపిటీసి మల్లేశం, సీనియర్ నాయకులు తుకారం, ప్రబాకర్ రెడ్డి రవీందర్, పాండు నాయకులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు ను ప్రారంభించిన దిశ కమిటీ మెంబర్



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న దిశ కమిటీ మెంబర్ వడ్ల నందు

**వికారాబాద్, మే 4, ప్రభాతవార్త:** చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో వికారాబాద్ మండలం గొట్టిముక్ల గ్రామంలో ఎంపీ నిధులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా సిసి రోడ్డు పనులు చేశారు. ఈ సీసీ రోడ్డును దిశా కమిటీ సభ్యులు, బిజెపి అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానంద రెడ్డిలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశం మొత్తం నరేంద్ర మోడీ ప్రభుత్వ వైపు చూస్తుందని అన్నారు. మోడీ ఏది చేసినా దేశ ప్రజల సంరక్షణ, సంక్షేమం కోసం చేస్తారని అన్నారు. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి సైతం చేవెళ్ల పార్లమెంట్ ను అభివృద్ధి పరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి నవీన్ కుమార్,బిజెపి వికారాబాద్ మండల అధ్యక్షులు శివరాజ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ గోపాల్ ,బూత్ అధ్యక్షులు లింగం,నరేష్,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్యాంగస్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి: బివివి.రెడ్డి


**ఘట్‌కేసర్, మే4, ప్రభాతవార్త:** ప్రజాస్వామిక విలువలను కాపాడే దిశగా భార రాజ్యాంగ పీఠికపై ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలని శుభమస్తు ఇన్‌ఫ్రా గ్రూప్ చైర్మన్–బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు బొక్క విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 212వ వారం నిత్య పూలమాళ కార్యక్రమం నిర్వహించారు. విష్ణువర్ధన్‌రెడ్డి విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బివివి.రెడ్డి మాట్లాడుతూ 60 దేశాల రాజ్యాంగాలను చదివిన అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించి సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు.
మతాలు, వర్ణ వ్యవస్థకు అనుగుణంగా సబండా వర్గాలకు న్యాయం చేసే దిశగా భారత రాజ్యాంగం రాసిన గొప్ప తత్వవేత్త, సాంఘిక సంస్కర్త మేధావి అంబేద్కర్ అని కొనియాడారు. భారత రాజ్యాంగ పరిరక్షణకు దేశ ప్రజలందరూ పాటుపడాలని అంబేద్కర్ ఆశయ సాధనలకు కృషి చేయాలని కోరారు. ఈసందర్భంగా భారత రాజ్యంగ పీఠికపై అందరి చేత ప్రమాణం చేయించారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అద్యక్షులు మేకల దాసు, ఎస్.బాల్‌రెడ్డి, కె.ఉపేందర్‌రెడ్డి, కె.నర్సింగ్‌రావు,బండారురాందాసు,తోక బాలయ్య,చంద్రమోహన్, అంజనేయులు, ఆనంద్, నిఖిల్,యాకేష్,లలిత్,నాగసాయి ు పాల్గొన్నారు.

# భూభారతి పైలట్ ప్రాజెక్టుగా కొందుర్గు మండలం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, మే 4 ప్రభాతవార్త :**
భూ భారతి గ్రామ రెవెన్యూ సదస్సులు ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సదస్సులో భాగంగా జిల్లాలో కొందుర్గు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందని, దీనికి సంబంధించి సదస్సులు నిర్వహించే చోట అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్లకు పలు సూచనలు, సలహాలతో పాటు దిశా నిర్ధేశం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఒక ప్రకటలో తెలిపారు. ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని జిల్లా కేంద్రాలను వినహాయించి జిల్లాలో ఒక మండలాన్ని పైలెట్‌గా తీసుకుని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకోవడం జరుగుతుందన్నారు.
ఈ నేపథ్యంలో జిల్లాలో కొందుర్గు మండలాన్ని పైలెట్‌గా తీసుకోవడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా కొందుర్గు పైలెట్‌లో రెండు టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి వెళ్లే ముందురోజు గ్రామాల్లో టామ్... టామ్ చేయించాలని, సంబందిత అదికారులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. అలాగే అన్ని రికార్డులు సిద్దంగా ఉంచుకోవాలని 20 గ్రామాల్లో సదస్సులు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసి అందుకనుగుణంగా పని చేయాలని అధికారులకు సూచించామన్నారు. అలాగే హెల్ప్ డెస్క్ దరఖాస్తులు, రెవెన్యూ సదదస్సుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.
జూన్ 2 వరకు పైలెట్ ప్రాజెక్టు కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని తెలిపారు. భూ బారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తులు నమోదు అయ్యేలా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో పొజిషన్‌లో ఉన్న రైతులకు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పట్టాలు ఉండి పొజిషన్‌లో లేని దరఖాస్తులు కూడా పరిశీలించడం జరుగుతుందని అన్నారు. హై కోర్టుల అనుమతులు రాగానే 12.10.2020 నుండి 10.11.2020 వరకు పెండింగ్‌లో ఉన్న సాధా బైనామా దరఖాస్తులను పరిష్కారం చేయాలని, దీనికి అవసరమైన కార్యాచరణ పూర్తి చేయాలన్నారు. ఈ నెల చివరి వరకు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తప్పులు లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు.

# మహేశ్వరంలో సోషల్‌మీడియా ఆగడాలు

## స్థాయిని మరిచి అసభ్యపోస్టులు పార్టీలో గుర్తింపుకోసం కొందరి పిచ్చిప్రవర్తన ఐటి చట్టంకింద చర్యలు చేపట్టాలని డిమాండ్



**మహేశ్వరం మే 4(ప్రభాతవార్త :** సోషల్ మీడియా వేదిక అంటే సంఘములో సమాజంలో నలుగురికి మేలు జరిగే విధంగా వ్రాతలు ఉండాలేతప్ప, మహేశ్వరం నియోజకవర్గంలో మాత్రం రాజకీయ పార్టీల నాయకులు కొంతమంది సోషల్ మీడియాను జేబు సంస్థగా మార్చుతూ వితండ వాదాలకు ప్రజలకు, సమాజానికి రవ్వంత కూడా ఉ పయోగం లేని ప్రసంగాలు చేస్తు కొంతమంది రాజకీయ నాయకుల మెప్పు కోసం స్వార్థ పూరితమైన మాటలు మాట్లాడుతూ వాయిస్ మేసేజ్‌లు పెడుతు అస్థమానం పనికి మాలిన మాటలతో కాలం గడుపుతున్న కొంతమంది రాజకీయ పార్టీల కార్యకర్తల చిల్లర చేష్టలను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. ఇలాంటి నాయకుల తీరును చూసి చూడనట్లుగా పోతున్నప్పటికి, మహేశ్వరంలో మాత్రం కొంత మంది కాంగ్రెస్ బిఆర్ఎస్ నాయకులు అస్థమానం విమర్శలు, ప్రతి విమర్శలతో సోషల్ మీడియాలో కనిపించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదేదో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతుందనే అంశము ఏమాత్రం కాదు. గతంలో కాంగ్రెస్, టిడిపి నాయకుల మధ్య కూడా ఈ కథనాలు జోర్దారుగా కొనసాగుతూ వచ్చాయి.ఇలాంటి వాటిని ప్రాథమిక స్థాయిలో కట్టడి చేసి వదిలేయాలా, లేదా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తు తమ పని తాము చేసుకుంటు పోవాలే తప్పా వ్యక్తి గత దూషణలకు పోతూ అంటు పత్రికలో వ్రాయని బా
లో విమర్శలకు దిగుతు తమ ప్రతిష్టలను తామే తగ్గించుకుంటున్నారు. ఇలాంటి విమర్శల వల్ల మహేశ్వరం ప్రాంతానికి గాని మహేశ్వరం ప్రజలకు ఆవగింజంత ప్రయోజనం కూడా లేదనే విషయాన్ని సామాన్య ప్రజలు పెట్టుకొని నవ్వుకుంటున్నారు. సభ్యసమాజం ఎమనుకుంటున్నారనే విషయాన్ని ఈ నాయకులు గుర్తించ లేక పోతున్నారా తాము చేస్తున్న మేసేజ్‌లను చదువుతున్నా విద్యావంతులు సామాజిక స్పృహ కలిగిన నాయకులు తమ గురించి ఎమనకుంటున్నారు అనే విషయాన్ని మరిచి పోతున్నారా లేకా ఈ ప్రాంతము మీదా ప్రజాసమస్యలపైన వీరికి అవగాహన లేదా అనే అభిప్రాయం ప్రజల్లోకి పోతుందన్న విషయాన్ని మరిచిపోతున్నారా అని కొంతమంది మేధావులు ముక్కు విరుచుకుంటున్నారు. సోషల్ మీడియా ప్లాట్ ఫాంను అసభ్యకరమైన మేసేజ్‌లకు వేదికగా మార్చడం ఈ నాయకులకు పొరపాటుగా మారింది. ఏమాట్లాడుతున్నారో ఏమి వ్రాతలు పోస్టు చేస్తున్నారో కూడా మరచి పోతున్నారు. తాము ఏప్రాంతములో ఉంటున్నమో ఎలా జీవిస్తున్నామో తమ తాత ముత్తాత జీవన స్థితిగతులను మరిచిపోయి ఇతర కుటుంభాలు ఇతర మతాల మనోభావాల గురించి ఇష్టాను సారంగా మాట్లాడుతూ మతవిద్వేషాలను రెచ్చగొట్టే వారు ఈ ప్రాంతములో అధిక మవుతున్నారు.ఇలాంటి వారి వివరాలను స్థానిక పోలీసులే కాకుండా సోషల్ మీడిపై ప్రత్యేక పోలీస్ నిఘా విభాగం కూడా ఈ లాంటి వ్యక్తులపై త్వరలో చర్యలు తీసుకోవడానికి శ్రీకారం చుట్టనుంది. ఇష్టాను సారంగా సోషల్ మీడియా పోస్టులు చేస్తున్నా వారి పేర్లతో పాటు వారిసోషల్ మీడియా గ్రూపుల అడ్మిన్‌లపై కూడా త్వరలో క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. రాజకీయ కోణంలో మహేశ్వరంలో ఇష్టాను సారంగా పోస్టులు చేస్తున్న మహేశ్వరం పోలీసులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఇక ముందు రాచకొండ పోలీసులు ఈ చిల్లర పోస్టులతో ఆయా కుటుంభాలను బజారుకీడిస్తే వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా అదేశాలు జారీ చేసింది.మహేశ్వరం సోషల్ మీడియాలో తమ పార్టీ అభ్యర్థుల మెప్పుపొందడానికి కొంతమంది ప్రయత్నిస్తుంటే మరికొంత మంది సోషల్ మీడియాలో పేరు కోసం ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక పోలీసులు ముస్ముందు ఎలా వ్యవహరిస్తారో వేచిచూడాల్సిందే.

# ఏన్నాళ్ళు ఈ నరకయాతన !



**పెద్దేముల్,మే4, ప్రభాతవార్త:**
రోడ్డుగుంతలమయంగామారడంతో ప్రయాణికులు, వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. కనీసం ప్యాచ్‌వర్క్‌కు నోచుకోక పోవడంతో తరచు ప్రమాదాలు సరభవిస్తున్నాయి. ఇంతతతంగం జరుగుతున్న సంబంధిత అర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోవడం లేదనివిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాండూరు -వికారాబాద ప్రధాన మార్గములో పెద్దే ముల్ మండల పరిధిలోని కందనెల్లి నుంచి మన్‌సాన్ పల్లి వరకు రొడ్డు దారుణ ంగా దెబ్బతింది. అడుగడుడునగుంతలు ఏర్పడడంతో ప్రయాణం నరకంలా సాగుతోందని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు. నిత్యంతాండూరు ప్రాంతం నుంచివందల సంఖ్యలోవాహనాలు హైద్రాబాద్‌కు రారపోకలు సాగిస్తు న్నాయి.కానీరొడ్డు గుంతల మయంగా మారడంతో ఏక్కడ గుంత ఉందో తెలియక నిత్యం ఈ మార్గములో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రతినిత్యం ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధి కారులు, ముఖ్యనాయకులు ఇదే మార్గములో ప్రయాణించినవారికి ఇవేమి కనిపించడంలేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు దారుణంగా దెబ్బతినడంవల్లఇప్పుడే ఇంత జరుగుతుంటే రానున్న వర్షాకాలంలో ప్రయాణం మరేట్లా ఉంటుందో తలచు కుంటునే భయమే స్తుందని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గతంలోరొడ్డుకుగుంతలు ఏర్పడితే ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి ప్యాచ్‌వర్క్ చేయించేవారని, ప్రస్తుతం అవేమికాన రాకుండా అధికారులు పత్తా లేకుండా పోయారని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతంరోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరైన పనులు ప్రారంభించినట్లే చేసి నిలిపి వేసారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గుంతల మయంగా మారిన రోడ్లపై ఎన్నాళ్ళీ



నరక యాతన పడాలని వాహనదారులు, ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలుఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు .ఇప్పటికైన ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డునిర్మాణపు పనులను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పుడు?

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య



మహదేవ్‌పూర్‌లో మాట్లాడుతున్న బుద్దుల జంగయ్య

**కొందుర్గు, ప్రభాతవార్త, (మే4) :**
ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం మండల పరిధిలోని మహదేవ్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సీపీఐ గ్రామ శాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని చెప్పిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఏ గ్రామంలో ఒక్క ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించలేదని ఆయన ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్‌లు కట్టిస్తామని ఆశచూపి పది సంవత్సరాల పాటు కాలయాపన చేసిందని ఆరోపించారు.
ఎందుకు ప్రభుత్వం కాలయాపన చేస్తుందో లబ్దిదారులకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలు సక్రమంగా అమలు చేస్తున్నామని చెప్పి ఒక్క ఉచిత బస్సు తప్ప మిగతా ఐదు గ్యారంటీలు అమలు కావడం లేదని ఆయన ఆరోపించారు. ఇదేనా ప్రజా పాలన అని ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిచో ప్రజల పక్షాన హామీల అమలుకై పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాగళ్ల నరసింహ్మా, నాయకులు కిష్టయ్య, వెంకటయ్య, విజయ్‌పాల్గొన్నారు.
నూతన గ్రామ కార్యవర్గం ఎన్నిక
సీపీఐ మహదేవ్‌పూర్ నూతన గ్రామ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన గ్రామ కార్యదర్శిగా కె.జంగయ్య, సహాయ కార్యదర్శులుగా జి.యాదయ్య, రవిలతో పాటు మరో తొమ్మిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

# మున్సిపల్ ఇంచార్జ్ కమీషనర్‌గా భాస్కర్‌రెడ్డి

**ఘట్‌కేసర్, మే4, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పురపాలక సంఘం ఇంచార్జ్ కమీషనర్‌గా భాస్కర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత కమీషనర్ చంద్రశేఖర్ సెలవు పెట్టి విదేశీ పర్యటనకు వెళ్లడంతో సీడీఎంఏ ఆదేశాల మేరకు నాగారం మున్సిపల్ కమీషనర్ భాస్కర్‌రెడ్డికి ఘట్‌కేసర్ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు భాస్కర్‌రెడ్డి తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించి సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ వచ్చి బాధ్యతలు చేపట్టిన కమీషనర్ భాస్కర్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. వేసవి దృష్ట్యా భూగర్భజలాల తగ్గుముఖం పట్టాయని ప్రజలకు మంచినీటికి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పలు వార్డుల్లో గుంతల మయంగా మారిన రోడ్లకు మరమ్మత్తులు చేయించాలని ఆమె కోరారు.

# నేడు అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ప్రారంభించనున్న కేంద్ర మంత్రి గడ్కరీ

## సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయకుండా ఎలా ప్రారంభిస్తారు? ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, మే 4 ప్రభాతవార్త** : అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను సోమవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించనున్నారు. అంబర్ పేట ముకరం హోటల్–గోల్నాక చర్చి వరకు 1.6 కిలోమీటర్ల పొడవు, నాలుగు లేన్లతో రూ.415 కోట్ల వ్యయంతో ఫ్లైఓవర్‌ను నిర్మించారు. ఇందులో భూసేకరణ, ఆస్తుల కోసం జీహెచ్ఎంసీ నిధులు రూ.192 కోట్లు ఉండగా దాదాపు రూ.265 కోట్ల నిధులు నేషనల్ హైవే అథారిటీ వెచ్చించింది. దీనిపై ఇప్పటికే రాకపోకలు సాగుతుండగా సోమవారం కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, కిషన్‌రెడ్డి తదితరులు అధికారికంగా ప్రారంభించనున్నారు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గోల్నాక క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ.. ఇంకా అరువైళ్ళే భూసేకరణ చేయలేదు. ఫ్లైఓవర్ ఇరువైపుల సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయలేదు ఫ్లైఓవర్ ఎలా ప్రారంభిస్తారంటూ స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మండిపడ్డారు. పక్కా ప్రణాళిక లేకుండా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టడం వల్ల ఇప్పటికీ అంబర్ పేట ప్రజలు ప్రతీ రోజూ నరకం అనుభవిస్తున్నారని అన్నారు. కనీసం సర్వీసు రోడ్డు వేయకుండానే ఫ్లైఓవర్‌ను అధికారికంగా ఎలా ప్రారంభిస్తారని ఆయన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. ఈ ఫ్లైఓవర్‌కు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఏడేళ్ల క్రితం శంకుస్థాపన చేసినప్పటికీ భూసేకరణలో జాప్యం, మతపరమైన నిర్మాణాల అడ్డంకి తదితర సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పక్కా ప్రణాళికతో అధికారులు ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా రోడ్డు దాటేందుకు విద్యార్థులు, సర్వీస్ రోడ్డు లేకపోవడంతో వాహనదారులు దారులులేక చుట్టూ కిలోమీటర్ల కొద్ది తిరిగి వెళ్లాల్సి వస్తోందని కాలేరు వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ కింద ముందు ఫీట్ల ఎత్తులో రోడ్డు వేయడం వల్ల వర్షపునీటితో ఇరువైపుల ఉన్న బస్తీలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. గోల్నాక డివిజన్ చర్చి వద్ద నుంచి ఏర్పాటు చేయడంతో ఎడమ వైపు నుంచి కుడి వైపునకు ప్రతి రోజు వేలాది మంది విద్యార్థులు, స్థానికవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. చిన్నపాటి వర్షం కురిసినా బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పలు బస్తీల్లో, డోబీఘాట్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితో ముంపు సమస్య ఏర్పడుతున్నదని తెలిపారు. ఫ్లైఓవర్ వల్ల ఇన్ని సమస్యలూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలియదా అంటూ ఆయన నిలదీశారు. కిషన్‌రెడ్డికి అంబర్‌పేటవాసుల ఓట్లు కావాలి, ఆయన ఎంపీగా గెలుపుకు మోజార్టీ కావాలి.ఆయనకు అభివృద్ధి మాత్రం పట్టడం లేదని ఆయన ఆరోపించారు. ఈ ఫ్లైఓవర్ వల్ల అంబర్‌పేట వాసులకు ఉపయోగం అంతగా ఉండకుండా నిర్మాణం చేశారని, ఈ బ్రిడ్జి వల్ల హైదరాబాద్–వరంగల్ వెళ్లేవారికి ఎక్కువ ఉపయోగమన్నారు. అంబర్‌పేట నుండి కాచిగూడ కమేళా వరకు ఫ్లైవర్ వేస్తే ఉపయోగం ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు.ఇప్పటికైనా ఫ్లైవర్ కింద సర్వీస్ రోడ్లు, వర్షపు నీటిపైపులైన్ల పనులు, గ్రీనరీ అభివృద్ధి, బ్యూటిఫికేషన్ పనులు పూర్తి చేసిన తర్వాతే ఫ్లై ఓవర్‌ను అధికారికంగా ప్రారంభించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ డిమాండ్ చేశారు. సమావేశంలో అంబర్‌పేట కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, బిఆర్ఎస్ నాయకుడు బి.వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడారు.

# సమస్యల పరిష్కారమే ధ్యేయం

**కంటోన్మెంట్, మే 4 ప్రభాతవార్త** : కాలనీలోని సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లోని సుందర్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసి యేషన్ నూతన కమిటీని ఇటీవల నూతనంగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నూతన కమిటీ సభ్యులు వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాల యంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అనేక అభివృద్ధిపనులు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తెలుసుకొని తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నూతన అధ్య క్షుడు అమర్నాథ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రవి కుమార్, ఉపాధ్యక్షురాలు మాలిని మాజీ అధ్య క్షుడు మాచారావు తదితరులు పాల్గొన్నారు.

# ఓల్డ్‌సిటీ మెట్రో పనులు వేగవంతం

◆ అదనపు నిధులు విడుదల చేస్తామని వెల్లడి ◆ మెట్రో విస్తరణ పనులను పరిశీలించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

◆ అవరోధాలు అధిగమించి ముందుకు వెళ్తున్నామన్న మెట్రో ఎండి ఎన్వీఎస్ రెడ్డి



ఓల్డ్‌సిటీలో మెట్రో విస్తరణ పనులను పరిశీలిస్తున్న రామకృష్ణారావు, ఎన్‌విఎస్ రెడ్డి తదతరులు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** పాతబస్తీలో కొనసాగుతున్న మెట్రో విస్తరణ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు స్వయంగా పరిశీలించారు. ఆదివారం మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డితో కలిసి పాత నగరంలో మెట్రో కారిడార్‌ను సందర్శించారు. మెట్రోరైల్ మార్గంలో త్వరితగతిన జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. గత దశాబ్ద కాలంగా నిర్లక్ష్యానికి గురైన పాతనగర మెట్రో రైలు మార్గంలో ఇప్పుడు జరుగుతున్న పనుల తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంజీబీఎస్ నుండి చంద్రాయణ గుట్ట వరకు 7.5 కిలోమీటర్ల నిడివిగల ఈ మెట్రో కారిడార్‌లో ప్రభావిత ఆస్తుల కూల్చివేతలను మెట్రో ఎండీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. దారుల్‌షిఫా నుంచి ప్రారంభించి మండీ రోడ్, శాలిబండ జంక్షన్ మార్గంలో ప్రభావిత కట్టడాల కూల్చివేత పనులను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ మార్గంలో ఇరువైపులా చిక్కుముడులుగా ఉన్న క్లిష్టమైన విద్యుత్, టెలిఫోన్, టీవీ కేబుళ్లను అత్యంత జాగ్రత్తతో తొలగిస్తూ పనులు సాగిస్తున్నామని ఎన్వీఎస్ రెడ్డి ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఈ మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఇరుకైన రహదారులు ఉండడం వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా కూల్చివేత పనులను చేపట్టినట్టు మెట్రో ఎండీ వెల్లడించారు.ఈ మార్గంలో దాదాపు 105 మత,చారిత్రక, ఇతర సున్నిత కట్టడాలు ఉన్నాయని,వాటికి ఏమాత్రం హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ప్రభావిత కట్టడాల కూల్చివేతలు జరుపుతున్నామని ఆయన చెప్పారు. పగటిపూట వెనుకభాగంలోఉన్న కట్టడాలను తొలగించి, రాత్రి సమయాల్లో రహదారికి ఆనుకుని ఉన్న ప్రభావిత ఆస్తులను యంత్రాల సాయంతో తొలగిస్తున్నామని వివరించారు. ఇందుకు స్థానికులతో ముందుగానే సంప్రదింపులు జరుపుతున్నామని,వారి సహాయ సహకారాలతోనే ముందుకు సాగుతున్నామని ఆయన సిఎస్‌కు తెలిపారు.ఎదురౌతున్న సమస్యలను చాకచక్యంగా పరిష్కరిస్తూ, సమర్థవంతంగా విస్తరణ పనులను నిర్వహిస్తున్నందుకు మెట్రో ఎండీని, ఇతర అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రశంసించారు. ప్రభావిత ఆస్తులు దగ్గరదగ్గరగా ఉండటంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని సీఎస్ సూచించారు. సురక్షితంగా అక్కడ కూల్చివేతలు, శకలాలు తొలగించే కార్యక్రమం వెంటనే జరగాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. జరుగుతున్న పనుల తీరుతెన్నుల పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఇంకా వాటిని వేగవంతం చేయడానికి అదనపు నిధులను విడుదల చేస్తామని ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వెల్లడించారు.

### మెట్రో కొత్త కారిడార్‌ల డిపిఆర్‌లకు త్వరలో ఆమోద ముద్ర

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టుగా మెట్రో రైల్ రెండవ దశ డీపీఆర్‌లు సిద్ధమయ్యాయని, రాబోయే హెచ్ఏఎంఎల్ బోర్డు సమావేశంలో వాటిని పరిశీలించి, ఆమోదిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. వీటిని త్వరలో రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదించాక కేంద్రానికి పంపుతామని ఆయన వెల్లడించారు. జేబీఎస్–మేడ్చల్ (24.5 కి.మీ), జేబీఎస్–శామీర్‌పేట(22 కి.మీ) కారిడార్‌లతో పాటు శంషాబాద్–ఫ్యూచర్ సిటీ కొత్త కారిడార్(40 కి.మీ)కి కూడా డీపీఆర్‌లు సిద్ధం అయ్యాయని ఆయన తెలిపారు. మెట్రో ఎండీతో ఈ డీపీఆర్‌ల గురించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చర్చించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పాతనగరం మెట్రో మార్గం పర్యటనలో మున్సిపల్ శాఖ కార్యదర్శి కె.ఇల్లంబర్తి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వాటర్ బోర్డ్ ఎండీ అశోక్ రెడ్డి, ఇతర మున్సిపల్, మెట్రో, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### మూసారాంబాగ్ బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయండి.. సిఎస్

మూసారాంబాగ్ బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయండి.. సీఎస్ ఆదేశాలు మూసీ నదిపై రూ. 52 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆదివారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు.మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను పరిశీలించి నిర్మాణంలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించి త్వరగా అందుబాటులోకి తేవాలని ఆయన అధికారులను సూచించారు. సీఎస్ వెంట జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సంగీత కళాకారులకు శ్రీత్యాగరాజస్వామి ఆరాధ్య దైవం

## మంత్రి జూపల్లి కృష్ణారావు



త్యాగరాజస్వామి జయంతి మహోత్సవాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**సైఫాబాద్, మే 4 ప్రభాతవార్త:** శాస్త్రీయ సంగీతాన్ని ఊపిరిగా భావించి అదే ధ్యాస, ఆదే శ్వాసగా ఉన్న సంగీత కళాకారులకు శ్రీత్యాగరాజ స్వామి పూజ్యనీయులని, ఆయనే వారి ఆరాధ్య దేవుడని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. కర్ణాటక శాస్త్రీయ సంగీత సామ్రాజ్యాన్ని వాగ్గేయ కారుడు త్యాగయ్య అధిరోహించడం తెలుగు వారందరికి గర్వకారణమన్నారు. రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్‌బి స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన శ్రీత్యాగరాజ స్వామి 258వ జయంతి మహోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. అకాడమీ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన త్యాగరాజ కీర్తనలను బహుళ ప్రాచుర్యం కల్పించడానికి కృషి చేస్తామన్నారు. నేటి యాంత్రిక జీవితంలో యువత ఉరుకులు, పరుగులతో వత్తిడికి గురవుతున్నదని, దీంతో అనారోగ్య సమస్యలతో ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. త్యాగయ్య, అన్నయ్య, రాందాసు కీర్తనలు, నృత్యాలు మానసిక ఉల్లాసానికి, ప్రశాంతతకు చేకూర్చుతాయని మంత్రి చెప్పారు. అకాడమీ ఛైర్ పర్సన్ డా. అలేఖ్య పుంజాల మాట్లాడుతూ ప్రతి ఏడాది త్యాగరాజు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్.పద్మావతి, పద్మశ్రీ డా.శోభారాజ్, పద్మశ్రీ డాక్టర్ యెల్లా వెంకటేశ్వరరావు, బిసి ఫైనాన్స్‌కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, హైదరాబాద్ సిస్టర్ హరిప్రియ పాల్గొన్నారు. అనంతరం ఆనేక మంది త్యాగరాజ కీర్తనలు గానం చేసి అలరించారు.

# అందాల పోటీల సందడి షురూ..!

## 10 నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ 2025 పోటీలు.. భాగ్యనగరానికి చేరుకుంటున్న అందగత్తెలు



ఎయిర్‌పోర్టుకు చేరుకున్న అందగత్తెలకు నుదుట బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న దృశ్యం

**హైదరాబాద్, మే 4 ప్రభాతవార్త :** 'రావమ్మా ముద్దుగుమ్మ.. భాగ్యనగరం మీకు స్వాగతం పలుకుతోంది..నుదుటు కుంకుమ బొట్టుపెట్టి సంప్రదాయ బద్ధంగా పిలుస్తోంది..హారతి పట్టి ఆహ్వానం పలుకుతోంది..అందాల పోటీల్లో మీరే మొదటి స్థానంలో నిలవాలని కోరుకుంటోంది..ఇలా మీ రాక మాకెంతో సంతోషమంటోంది హైదరాబాద్..ఇలా భాగ్యనగరంలో అందాల పోటీల హడావుడి నెలకొంది. తెలంగాణలో అందాల పోటీల హడావుడి ప్రారంభమైంది.. మిస్ వరల్డ్ పోటీల కోసం హైదరాబాద్ నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అందగత్తెలు పాల్గొననున్న ఈ వేడుకకు భాగ్యనగరం వేదిక కావడం పట్ల నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాలతో నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించనుంది.పలు దేశాల అందగత్తెలు హైదరాబాద్ నగరానికి చేరుకుంటున్నారు. వారికి నిర్వాహకులు ఘన స్వాగతం పలుకుతున్నారు.కెనడా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మిస్ కెనడా క్యాథరన్ మోరిసన్‌కు ఘనస్వాగతం లభించింది. యువతులు సంప్రదాయ నృత్యాలు చేస్తుండగా.. తెలంగాణ సంప్రదాయం ప్రకారం హారతిపట్టి, నుదుట బొట్టుపెట్టి, మెడలో పూలమాల వేసి ఆహ్వానించారు. అనంతరం ఆమెను ఆతిథ్యం ఇచ్చే హోటల్‌కు తీసుకువెళ్లారు.హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ 2025 పోటీలు ఇలా..ఈ నెల 10 నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ 2025 పోటీలు జరగనున్నాయి. ఇందులో 120 దేశాల ప్రతినిధులు పాల్గొంటారు. 150 పైగా దేశాల్లో ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఇప్పటికే మిస్‌వరల్డ్ సంస్థ చైర్‌పర్సన్ మిస్ జూలియా ఎవెలిన్ మోర్లీ, మిస్‌వరల్డ్ ప్రతినిధి మిస్ క్రెరి హైదరాబాద్ చేరుకున్నారు.

### 13న హెరిటేజ్ వాక్..

మరో వైపు ఈనెల 13న మిస్ వరల్డ్ పోటీదారులు చార్మినార్ దగ్గర హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. ఇందుకోసం మదీనా, పత్తర్‌గట్టి, గుల్జర్ హౌస్, చార్మినార్, లాడ్ బజార్ గాజుల మార్కెట్ నుంచి చౌమొహల్లా ప్యాలెస్ వరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో షాపులకు కూడా మెరుగులు దిద్దుతున్నారు.

# మాతృభాష తెలుగును కాపాడుకోవాలి

## మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల పూర్వ గవర్నర్ విద్యాసాగర్‌రావు

**నాంపల్లి, మే 4 ప్రభాతవార్త :** మాతృభాష తెలుగును కాపాడుకోవాల్సిన బాధ్యత మొత్తం తెలుగుజాతిపై ఉందని మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల పూర్వగవర్నరు సిహెచ్.విద్యాసాగర్ రావు అన్నారు. ప్రపంచంలో ఏదేశంలోనైనా ఒకస్థాయి వరకు మాతృభాషలో విద్యాభ్యాసం చేయడం ద్వారా మేధావుల్ని, సమాజానికి ఉత్తమపౌరుల్ని అందించిన ఆనవాళ్లు ఎన్నో ఉన్న విషయాన్ని ఆయన తెలిపారుజ. బొగ్గులకుంట తిలక్‌రోడ్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలో డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు డా. ఎం.శ్రీధర్‌రెడ్డి పేరుతో ఏర్పాటు చేసిన ధర్మనిధి సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు పాశం యాదగిరికి ప్రదానం చేశారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విద్యాసాగర్‌రావు యాదగిరిని ఘనంగా శాలువా, జ్ఞాపికతో సత్కరించి సాహిత్య పురస్కారంతో పాటు 25వేల రూపాయల నగదును అందించి శుభాభినందనలు తెలిపారు. అనంతరం విద్యాసాగర్ రావు మాట్లాడుతూ ఉభయ తెలుగురాష్ట్రాలలో గిరిజనుల స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని, వారికి చెందిన భూములు అన్యాక్రాంతమై వారు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటున్నా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు. మహారాష్ట్ర గవర్నరుగా ఉన్నకాలంలో ఈ పరిస్థితిని నివారించడానికి రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్‌ను అమలు చేశానని తెలిపారు.ఆచార్య శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో 82 సంవత్సరాలుగా సారస్వత పరిషత్తు తెలుగుభాషకు చేయాల్సిన సేవలో తనవంతు పాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చివరిగా సాహిత్య పురస్కార గ్రహీత పాశం యాదగిరి పర్యావరణ న్యాయం అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. డా. విజయలక్ష్మి, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్యలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# భవనంపై నుంచి దూకి గృహిణి ఆత్మహత్య

**కుత్బుల్లాపూర్, మే 4 ప్రభాతవార్త :** ఇష్టంలేని పెళ్లి చేశారనే మనోవేదనతో ఓ నవ వధువు ఐదంతస్థుల భవనంపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పరిధిలోని సుభాష్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన హరికృష్ణకు ఆదేప్రాంతానికి చెందిన లక్ష్మి(25)తో గతసంవత్సరం డిసెంబరు 14న వివాహం జరిగింది. రెండు నెలలక్రితం లక్ష్మి తన స్వగ్రామం నుండి వచ్చి జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌కు వచ్చింది. హరికృష్ణ ప్రైవేట్ కంపెనీలో అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్నాడు. లక్ష్మితోపాటు తమ్ముడు కూడా ఆమెతోపాటే ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. కొంతకాలంగా ఇష్టంలేని వివాహం చేశారనే మనోవేదనతో ఆదివారం ఉదయం నాలుగున్నర నుండి ఐదున్నర గంటల సమయంలో తాను నివసిస్తున్న భవనంపై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేని జీడిమెట్ల పోలీసులు తెలపారు. సంఘటన ఉదయం నాలుగున్నర నుండి ఐదున్నర గంటల కాలంలో జరగగా సమాచారం అందిన వెంటనే జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆద్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# వాహన దొంగలు అరెస్ట్

**హైదరాబాద్, మే4, ప్రభాతవార్త:** నగరంలో దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను అరెస్ట్ చేయగా ఒకరు పరారిలో ఉన్నాడు. హుమాయన్‌నగర్, నార్సింగ్, కొల్లురు, శంషాబాద్ పోలీస్ స్టేషన్లలో జరిగిన ఘటనలపై ఆదివారం నగర టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వివరాలను వెల్లడించారు. టోలిచౌకికి చెందిన మహ్మద్ నవీద్ (22), సమీ (21)లు చిన్ననాటి బాల్య స్నేహితులు. వీరు ఆటోలో వెళ్లి నార్సింగ్ పీఎస్ పరిధిలో ఒక బైక్‌ను దొంగతనం చేసి రహ్మాన్‌కు రూ.10వేలకు అమ్మగా...ఇతను స్నేహితుడు అయిన మహ్మద్‌బసీద్‌కు అదే ధరకు విక్రయించాడు. అదేవిధంగా హాకీంపేటకు చెందిన సోహేల్ (19), ప్లంబర్ పని చేస్తాడు. సొంత వాహనంపై వెళ్లి హుమాయన్‌నగర్ పీఎస్ పరిధిలో మరో బైక్‌ను తీసుకెళ్లి రూ.10వేలకు విక్రయించాడు. మరో ఘటనలో టోలిచౌకికి చెందిన షేక్‌మోహిత్ (20), మహ్మద్ మెహ్రాజ్(19), అబ్బాస్ (20)లు వేర్వేరు పనులు చేస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాన్ని ఎంచుకొని కొల్లూరు పీఎస్ పరిధిలో బైక్‌ను దొంగతనం చేసి రూ.15వేలకు అమ్మాడు. బహదూర్‌పురకు చెందిన సమద్ (23), నసీర్ (26) బావబామ్మర్దులు. శంషాబాద్ పీఎస్ పరిధిలో ఆటోను తీసుకవెళ్లాడు. వేర్వేరు ఘటనల్లో ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదుకాగా నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం రంగంలోకి దిగింది. నిఘా ఏర్పాటు చేసి సీసీఫుటేజీల ఆధారంగా ఆరుగురిని అదుపులోకి తీసుకోగా మెహ్రాజ్, అబ్బాస్‌లు పరారీలో ఉండగా ఆరుగురిని అదులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు ఆటోలు, అయిదు బైక్‌లను స్వాధీనం చేసుకొని ఇద్దరిని జువైనల్ హోంకు, రిమాండ్‌కు తరలించారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, ఎస్సైలు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలతో నిందితులు

# పెరగనున్న మెట్రో ఛార్జీలు..!

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త**

హైదరాబాద్ మెట్రో రైలు ఛార్జీలు పెరగబోతున్నాయి. మే రెండోవారం నుంచి సవరించిన ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని మెట్రో వర్గాలు పేర్కొంటున్నాయి. ఎల్ అండ్ టీ చైర్మన్ ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆయన వచ్చేవారం రాగానే ఛార్జీలు ఖరారు కానున్నాయి. వీటి ద్వారా వార్షికంగా అదనంగా రూ.150 కోట్ల వరకు రాబట్టుకునేలా ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ కసరత్తు చేస్తోంది. మెట్రో రైలు ప్రాజెక్టు కారణంగా ఎల్ అండ్ టీ సంస్థ భారీ నష్టాలను ఎదుర్కొంటోంది. సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం సుమారు రూ.6,500 కోట్ల నష్టం వాటిల్లినట్లు సమాచారం. స్టేషన్లు, మాల్స్‌లో రిటైల్ స్పేస్ లీజ్, ప్రకటనలతో ఆదాయ మార్గాలను మెరుగుపర్చుకోవడానికి సంస్థ నిరంతర ప్రయత్నాలు చేస్తున్నా నష్టాలు భరించలేని స్థాయికి చేరాయంటోంది. ఛార్జీల పెంపుదల కోసం ఎల్‌అండ్‌టీ గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.దీంతో ఛార్జీల పెంపు తప్పేలా లేదని అధికారవర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం కనిష్ఠ ఛార్జీ రూ.10. గరిష్ఠంగా ఛారీలు రూ.60 ఉన్నాయి. గరిష్ఠం రూ.75 వరకు పెరిగే అవకాశం ఉందని సమాచారం. దీన్ని ఇంతవరకు పెంచాలా? ఎంత పెంచాలి? ఎప్పుడు పెంచాలి? మొదట పెంచి ఆ తర్వాత తగ్గించాలా? ఇలా పలు కోణాల్లో సంస్థ యోచిస్తోంది. ఇప్పటికే రూ.59తో ఉన్న హాలిడే సేవర్ కార్డును రద్దు చేసింది. మెట్రో కార్డుపై రద్దీవేళల్లో 10 శాతం రాయితీని ఎత్తివేసింది. మెట్రో ఆపరేషన్స్, ప్రకటనలు, మాల్స్ అద్దెల ద్వారా ఏటా రూ.1500 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. మెట్రో నిర్వహణ, బ్యాంకు రుణాలపై వడ్డీల చెల్లింపు తదితర ఖర్చులన్నీ కలిపి రూ.2 వేల వరకు వ్యయం అవుతోందని ఎల్ అండ్ టీ వర్గాలు చెబుతున్నాయి

# వృద్ధ దంపతులు దారుణ హత్య

## లక్ష నగదు, బంగారు ఆభరణాలు అపహరణ



కనకయ్య(ఫైల్ ఫొటో)

**అల్వాల్, మే 4 ప్రభాతవార్త:** సొంత ఊరిలో వ్యవసాయం చేసుకునే సత్తువ లేక పోవడం, జీవిత చరమాంకంలో కడుపున పుట్టిన బిడ్డలు వద్ద ఉండి శేష జీవితాన్ని గడిపేద్దామనుకున్న వృద్ధ దంపతులు నగరానికి చేరుకున్నారు. వాచ్‌మెన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్న వారిని అనారోగ్య సమస్యలు వెంటాడాయి. నగర జీవనం తమకు సరిపడదని అనుకున్న వారు పుట్టి పెరిగిన ఊరికి వెళ్లిపోవడానికి సిద్ధపడిన సమయంలో దారుణ హత్యకు గురయ్యారు. పాత కక్షలు లేదా ఆర్థిక పరమైన లావాదేవీలు కారణంగా ఘటన జరిగి ఉంటుందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అల్వాల్‌లో సంచలనంగా మారిన హత్యలకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఖమ్మం జిల్లా ఇల్లందు మండలం మాణిక్యారం గ్రామానికి చెందిన కనకయ్య (70), రాజమ్మ(65) దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉండగా వీరందరికి వివాహాలు జరిగాయి. సంతానం అంతా హైదరాబాద్ నగరంలో నివసిస్తున్నారు. వయసు పెరగడంతో ఊరిలో వ్యవసాయం చేయలేని పరిస్థితి దాపురించింది. బిడ్డలు వద్దకు వెళ్లి చిన్నా చితక పనులు చేసుకుంటూ జీవితాన్ని గడుపుదామని మూడు సంవత్సరాలు క్రితం అల్వాల్‌కు చేరుకున్నారు. కుమారుడు రాంబాబు, కూతురు లతలు నివాసం ఉంటున్న సూర్యనగర్‌కు వచ్చి కనకయ్య వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా దంపతులు ఇద్దరు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. సొంత ఊరికి వెళితే ఆరోగ్యం కుదుటపడుతుందనే నిర్ణయానికి ఇరువురు వచ్చారు. శనివారం రాత్రి కూతురు ఇంటికి వెళ్ళిన కనకయ్య సామాన్లు సర్దుకోవడానికి అవసరమైన సంచులను తెచ్చుకోవడం జరిగింది. ఇదిలా ఉండగా ఇటీవల ఊరికి వెళ్ళిన కనకయ్య అక్కడి నుంచి లక్ష రూపాయలు తెచ్చి స్థానికంగా వడ్డీకి ఇవ్వడానికి ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలిసిన వ్యక్తులే దారుణానికి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి నిద్రలో ఉన్న దంపతులను దుంగ కట్టెలతో తలపై మోది హత్య చేశారు. లక్ష నగదుతో పాటు రాజమ్మ ఒంటిపై ఉండే బంగారు ఆభరణాలు కనిపించడం లేదని కొడుకు, కూతురు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దంపతులు వద్ద నగదు ఉందనే సమాచారం బయటకు తెలిసిన నేపథ్యంలో ఘటన జరిగి ఉంటుందనే తెలుస్తోంది. డాగ్ స్క్వాడ్‌కు చెందిన జగిలం హత్య జరిగిన దగ్గరలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద కలియ తిరిగింది. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది.

బాలానగర్ డిసిపి సురేష్‌కుమార్, పేట్‌బషీరాబాద్ ఎసిపి రాములు, అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. హత్య మిస్టరీని చేధించేందుకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేశామని కొన్ని ఆధారాలు లభ్యం అయ్యాయని డిసిపి తెలిపారు.

